# సమయస్ఫూర్తి

-వి.రుక్మిణి



"ఏంటి బాబూ అది, తుపాకి పట్టుకుని బెదిరిస్తున్నావు. మా ఆయన కొనే వస్తువులేవీ పని చేయవని నాకు బాగా తెలుసు. ఆ పనికిమాలిన తుపాకీ చూపించి ఏం బెదిరిస్తావు కానీ ముందు దాన్ని దించి రా లోపలికి."

ఈ ముసలామెకు మతున్నట్లులేదు. ఇలా లోపలికి రమ్మని పిలుస్తారా ఎవరన్నా?

"ఇంతకీ ఎంతకు అంటగట్టున్నావు నాయనా ఆ తుపాకీ? అయినా అందరికీ ఈయనే దొరికారా పనికిమాలిన వస్తువులు కొనడానికి."

"ఏంటమ్మో మీరు మాట్లాడేది. ఇదేం పనికిమాలిన తుపాకీ కాదు. మంచి నాటు తుపాకీ. ఏమనుకున్నావో ఏమో. చూపించు మీ ఇంట్లో ఏమేం మంచి వస్తువులున్నాయో!"

"ఓరి నీ అఘాయిత్యం కూలా కొనడానికి వచ్చావా? అయితే ఆ మాట ముందే చెప్పొచ్చు కదరా అబ్బాయ్. ఇదిగో బోలెడన్ని టేపురికార్డర్లు, విసీపీలు, కెమెరాలు, గడియారాలు... ఏవి కావాలి బాబూ."

"ఏంటేంటీ, అందరింట్లల్లో ఒక టేపు రికార్డరు, ఒక వీసీపీ వుంటే మీ ఇంట్లో బోలెడున్నాయా? ఏవీ చూపించు."

"ఎంత కొనడానికి వచ్చినా అంత బొత్తిగా మర్యాదా మన్ననా లేదురా అబ్బాయ్. చూపించు అంటూ దబాయించినట్లు మాట్లాడకపోతే చూపించమ్మా అనలేవూ. ఎవరికైనా కొంచెం చిన్నంతరం పెద్దంతరం ఉండాలిరా. రా...రా ఈ రూములోనే వున్నాయి అన్నీ."

"సరే. ఆ వస్తువులకేంగానమ్మ. మరి బంగారం, వెండి వస్తువులన్నీ ఎక్కడ? నెక్లెసు, గాజులు అలాంటివి."

"ఏమిటీ నాకు నెక్లెసు కొన్నానని చెప్పారా ఈ మానవుడు? ఎన్నాళ్లనుంచో అడుగుతున్నా అసలా మాటయినా ఎత్తరే, ఎంతసేపు ఈ పాడు వస్తువులే తప్ప. కనీసం ఆయనతో బంగారం మాటన్నా అనిపించావురా అబ్బాయి. ఇంకా ఏమేమి కొంటానన్నారురా!"

"అవేనండి, మంగళసూత్రం చైను, గాజులు, కమ్మలు..."

"మా నాయనే, మా నాయనే. మంగళసూత్రం మాటైనా ఎత్తించావు ఆయనచేత. ఎన్ని రోజులైందీ నా సూత్రం తాడు పెరిగిపోయి. ఇదిగో అదిగో అనడమేగానీ ఇంతకూ నా అనుమానమేమిటో చెప్పమంటావురా అబ్బాయి. అది కూడా అమ్మేసి ఇదిగో ఈ వెధవ వస్తులేవో కొన్నారేమో."

ఇంతలో 'భౌ...భౌ'మంటూ వచ్చింది టిక్కూ.

"రా..రా టిక్కూ రా. ఇంతసేపు ఎక్కడున్నావురా బుజ్జికన్నా. రాత్రంతా మెలుకునే వున్నావేరా పిచ్చికన్నా. అట్లా నిద్రపోయావు ఎవరొచ్చిందీ చూడనైనా చూడకుండా" ఆ కుక్క బొచ్చు నిమిరి దానికి తాను ఎంతో ముద్దుగా కుట్టిన డ్రెస్సు ఒక్కసారి సరి చేసింది.

"ఏందమ్మా... మనింట్లో కుక్క కూడా ఉందా. ఇదేమీ మొరిగి గిరిగి చేయదా?"

"అబ్బే ఇది మొరగదురా అబ్బాయ్. కోపమొచ్చిందంటే కరిచేస్తుందంతే."

"సరే...సరే ముందు దాన్ని కట్టేయ్ తల్లీ."

"నీకంత భయమైతే అలాగే కట్టేస్తానులే" అంటూ అక్కడే తను కూర్చున్న కుర్చీకి కట్టేసింది.

"తొందరగా చూపించమ్మా ఏవేమున్నాయో!"

"చెప్పానుకదరా చాలానే వున్నాయని. ఆంటీక్కులట ఆంటీక్కులు. ఎంతో ధర చేస్తాయట. ఎప్పుడో ఏమో! మేం కన్ను మూసిన తరువాత ఎంతొస్తే ఏం లాభం? అవి అమ్మేసి ఏమైనా చేయించమంటే వినరు."

"ఆ వస్తువులేవో చూపించండి మరి. నాక్కావలసినవేవో నేను పట్టుకెళ్తాను."

"అంత తొందరైతే ఎలాగ. వారినీ రానీ. వారితో మాటా మంచీ మాట్లాడి పట్టుకెళ్ళువుగానీ. మాస్టారు ఇంక ఏ నిముషమైనా రావచ్చు. మా తమ్ముడు నిన్ననే ఈ వూరికొచ్చాడు ట్రాన్స్‌ఫర్‌మీద. నిన్ననే అన్ని పేపర్లలో వేసాడు వాడి ఫోటో. చూడలేదూ నువ్వు. ఐజి ఆనందమూర్తిరా. అయినా మీ కుర్రకారుకు ఈ రోజుల్లో పేపరు చదివే తీరికేది. ఎప్పుడూ ఏదో చేస్తూనే ఉంటారాయె. మావాడ్ని దగ్గరుండి మరీ తీసుకొస్తానని వెళ్లారు ఆయన. అయినా వాడికి ఎన్ని పనులో ఏమో. ఆ చిన్న వూర్లోనే అంత బిజీగా ఉండేవాడు. ఇంక ఈ హైదరాబాద్ కొంపలో ఎంత బిజీ అయిపోతాడో ఏమో. అందుకే తనే వస్తానన్నా దగ్గరుండి మరీ పిల్చుకొస్తానని వెళ్లారు. ఏ దొంగ సచ్చినోడి కేసైనా వచ్చిందో ఏమో ఇంత ఆలస్యం అయింది. వాడికిష్టమని పెరుగ్గారెలు కూడా చేసాను. వుండు...నువ్వు కూడా రెండు గారెలు తిని పోదువుగానీ."

"ఎవరూ వచ్చేదీ ఆనందమూర్తి అంటే ఆ పోలీసాయనేనా?"

"అంత ఐజీని పట్టుకుని ఎంత తేలిగ్గా ఆ పోలీసు అంటావేమిట్రా! ఇంతకీ నీకు మా తమ్ముడు అంత బాగా తెలుసా. అయితే మరీ మంచిది ఉండిపో."

"ఆయన తెలీకపోవడమేంటమ్మా. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పేరు వినని వాడుంటాడా? అంత పెద్దాయన వస్తుంటే మీకింకా ఎన్ని పనులున్నాయో ఏమో! మళ్ళీ వస్తానులెండి" అక్కడనుండి ఉడాయించాడు ఆగంతకుడు.

'అమ్మయ్య' అంటూ నిట్టూర్చి కాళ్ళు వణుకుతుంటే కుర్చీలో కూలబడిపోయింది ఆవిడ. కొంచెం సేపటికి తేరుకుని గడగడా గ్లాసెడు మంచినీళ్ళు తాగేసింది.

"ఇలా రారా టిక్కూ! ఎంత గండం గడిచిందో చూడరా ఈ రోజు. పేపర్ చదవడం కూడా ఇట్టా పనికొస్తుందనుకోలేదురా బుజ్జీ" అంటూ దాని కట్టు విడిపించి తన వళ్ళో కూర్చోబెట్టుకుంది. మెల్లగా దాని డ్రెస్సు జేబులోంచి నెక్లెసు, గాజులు, కమ్మలు అన్నీ ఒక్కసారి తీసి చూసుకుంది. మనస్సు కుదుటపడింది. తన కుక్క బ్యాంకు లాకరు ఐడియా బాగానే పని చేసిందని సంతోషిస్తూ "అన్ని బ్యాంకులకన్నా నువ్వే బెటర్‌రా నా భైరవ బ్యాంకూ" అంటూ టిక్కూను ముద్దాడింది.

★